# అంతర్జాల శిక్షణకు ఆదరణ

## పెరుగుతున్న విద్యార్థులు

**న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం**

**విదేశాలకు వెళ్లాలంటే ఆంగ్లంలో** పరిజ్ఞానం తప్పనిసరి.. మంచి ఉద్యోగం సంపాదించాలంటే ఇంగ్లిష్‌లో మాట్లాడటం రావాలి. పల్లె ప్రాంతాల్లో ఉన్నవారికి ఆంగ్లం నేర్చుకోవడం కష్టమైన పనే.. అందుబాటులో శిక్షకులు లేక ఇబ్బందులు తప్పవు. స్పోకెన్ ఇంగ్లిష్ ఇన్‌స్టిట్యూట్లు ఉన్నా.. అక్కడకు వెళ్లి నేర్చుకునే తీరిక ఉండకపోవచ్చు. సరిగ్గా ఇలాంటి




**లైవ్ ట్యూషన్ వెబ్‌సైట్లలో ఒకటి**

వారికోసమే వెలిశాయి 'ఆన్‌లైన్ ట్యూషన్లు'. దూర ప్రాంతాల్లో ఉన్నా అంతర్జాలం ద్వారా ఆంగ్లం, అకౌంటింగ్, సైన్స్, లెక్కలు తదితర అంశాలను నేర్చుకునే వెసులుబాటు కలిగింది. కేవలం అంతర్జాలం ద్వారానే పాఠాలు బోధించే సైట్లు కొన్ని ఉండగా శిక్షణ కోరుకునే వారిని, నేర్పించే వారిని అనుసంధానం చేసి ఆన్‌లైన్ ద్వారా ట్యూషన్లు అందించే సైట్లు మరికొన్ని ఉన్నాయి.

### ఎలా చేస్తారు...

ఆన్‌లైన్‌లో శిక్షణ పొందాలనుకునే వారు, ట్యూటర్ల కోసం కొన్ని వెబ్‌సైట్లు ఉన్నాయి. నేర్చుకోవాలనుకునే వారు, ట్యూటర్లు ఈ వెబ్‌సైట్లలో నిర్ణీత రుసుంతో రిజిస్ట్రేషను చేసుకోవాలి. ఈ వెబ్‌సైట్‌లో వారి వారి వివరాలను ఉంచుతారు. ఎవరికి అవసరమైన వారిని వారు ఎంచుకొని కావాల్సిన శిక్షణ, ఫీజులను మాట్లాడుకున్నాక శిక్షణ మొదలుపెడతారు. సాధారణంగా విదేశాలకు వెళ్లిన భారతీయులు భాషపై పట్టుకోసం ఆన్‌లైన్ శిక్షణను ఆశ్రయిస్తున్నారు. కొందరు అకౌంటింగ్ నేర్చుకుంటున్నారు. ఈ సైట్లలోనే పబ్లిక్ సెషన్ ద్వారా ఒకే సారి ఆన్‌లైన్‌లో ప్రపంచంలోని వారంతా చూసేలా కార్యక్రమాలుంటాయి. కొన్ని సందర్భాల్లో ట్యూటర్లు ఇలా ఒక్కొక్క విషయంపై శిక్షణ ఇస్తూ వారి ప్రతిభను కనబరుస్తున్నారు. అకౌంటింగ్, గణితం లాంటివి నేర్పించేందుకు 'డిజిటల్ పెన్ టాబ్లెట్' ఎంతగానో దోహదపడుతుంది. దీనికి కంప్యూటరుకు కనెక్టు చేసి దీనిపై ఏం రాసినా కంప్యూటర్ ద్వారా ఎదుటి వ్యక్తి చదువుకునే వీలుంటుంది.

ఇలాంటి ఓ వెబ్‌సైట్ ద్వారా గోదావరిఖనికి చెందిన భాగ్యప్రభాషిణి ఏడాది కాలంగా అబుదాబి, న్యూయార్క్, ఖతర్, ఈజిప్ట్, సూడన్ తదితర దేశాల్లోని విద్యార్థులు, ఉద్యోగులకు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తున్నారు. కమాన్‌పూర్ మండలం చందనాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న గోదావరిఖనికి చెందిన సి.భాగ్యప్రభాషిణి మొదట్లో మార్కండేయ కాలనీలో స్పోకెన్ ఇంగ్లిష్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తుండేవారు. ఇంకా ఏదో సాధించాలనే తపన ఆమెను ఆన్‌లైన్ ట్యూషన్ల వైపు లాగింది. ఇంట్లో నుంచే నేరుగా విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలనే తపన ఆమె సక్సెస్‌కు కారణం. ఏడాది క్రితం ఆన్‌లైన్ ట్యూషన్లు



**ఆన్‌లైన్‌లో ట్యూషన్లు చెబుతున్న భాగ్య ప్రభాషిణి**

మొదలుపెట్టిన భాగ్యప్రభాషిణి రాష్ట్రంలోనే మొదటి ఆన్‌లైన్ ట్యూటర్. కాగా ఇప్పుడు చాలా మంది ఈ ప్రక్రియలో చేరారు. ఆన్‌లైన్ ద్వారా ట్యూషన్లు చెప్పాలనుకునే ట్యూటర్లకే ఈమె శిక్షణ ఇవ్వడం ఈమె సాధించిన ప్రగతికి నిదర్శనం.

### ఎంతో సంతృప్తిగా ఉంది..

**- భాగ్యప్రభాషిణి**

ఆన్‌లైన్‌లో విదేశాల్లోని వారికి శిక్షణ ఇవ్వడం నాకెంతో సంతృప్తిని ఇస్తోంది. చేస్తున్న ఉద్యోగానికి ఎలాంటి ఆటంకం లేకుండా ఇంట్లోనే ఉంటూ వారికి అవసరమైన విషయంలో శిక్షణ ఇస్తుంటాను. దీనికి భర్త రఘు ప్రోత్సాహం తోడైంది. ఆన్‌లైన్‌లో ట్యూటర్లుగా చేరే వారు జాగ్రత్తగా వ్యవహరిస్తూ ఆయా వెబ్‌సైట్లలో విద్యార్థులను ఎంచుకోవాల్సి ఉంటుంది. కొందరు కావాలని ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషను చేసుకుంటారు తప్ప నేర్చుకోవడంపై శ్రద్ధ వహించరు. ఇలాంటి వారినుంచి జాగ్రత్తగా వ్యవహరించాలి.



**డిజిటల్ పెన్ టాబ్లెట్**